క్లుప్తంగా

హెచ్‌ఎంగా బాధ్యతల స్వీకరణ



హెచ్‌ఎం నిర్మలాకుమారికి అభినందనలు తెలుపుతున్న ఉపాధ్యాయులు

కోటవురట్ల: స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా జి.నిర్మలాకుమారి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన హెచ్‌ఎం ఏసుబాబుకు చోడవరం మండల లక్ష్మీపురం జెడ్పీ హైస్కూల్‌కు బదిలీ అయ్యారు. పరవాడ జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో పనిచేసిన నిర్మలాకుమారి ఇక్కడకు బదిలీపై వచ్చారు. బాధ్యతలు చేపట్టిన హెచ్‌ఎం నిర్మలాకుమారికి ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. ఆమె మాట్లాడుతూ విద్యాప్రమాణాలు మెరుగుపడేలా కృషి చేస్తానన్నారు. అందరి సహకారంతో ఉత్తమ ఫలితాల సాధనకు పాడుపడతామన్నారు.

రేషన్ డిపోలను సందర్శించిన తహసీల్దార్



మునగపాకలో రేషన్ అందజేస్తున్న తహసీల్దార్ ఆదిమహేశ్వరరావు

మునగపాక: మండలంలోని పలు రేషన్ డిపోలను మంగళవారం తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు సందర్శించారు. రేషన్ సరకుల బట్వాడా తీరును పరిశీలించిన ఆయన డీలర్లకు పలు సూచనలు చేశారు. ప్రతి నెలా 15వ తేదీ వరకు క్రమం తప్పకుండా రేషన్ సరకులను అందించాలన్నారు. రెండు పూటలూ సేవలందించాలన్నారు. దీనిలో భాగంగా డిపోకు రాలేని వారికి ఆయన రేషన్ ఇంటికి వెళ్లి అందజేశారు. ఆర్ఐ పడాల్, వీఆర్వో సురేష్‌లు పాల్గొన్నారు.

యోగా అలవాటు చేసుకోవాలి



డ్రాయింగ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

మునగపాక: ప్రతి ఒక్కరూ యోగా సాధన చేయడం అలవాటు చేసుకోవాలని ఎంపీడీవో ఎం.ఉషారాణి కోరారు. యోగాంధ్రలో భాగంగా మునగపాక రాహుల్ గాంధీ కల్యాణ మండపంలో విద్యార్థులకు నిర్వహించిన డ్రాయింగ్ పోటీలను ఆమె మంగళవారం పరిశీలించారు. మండల పరిషత్ సూపరింటెండెంట్ ప్రసాద్, ఈవోపీఆర్డీ సోమరాజు, సచివాలయ ఉద్యోగులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

రుచికరంగా మధ్యాహ్న భోజనం



వంటలు పరిశీలిస్తున్న ఎంఈవోలు వేణుగోపాలరావు, శివనాయుడు

మునగపాక: మధ్యాహ్న భోజనం తయారీలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంఈవోలు వేణుగోపాలరావు, బుద్ధ శివనాయుడు కోరారు. మంగళవారం మునగపాకలో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు ఒక రోజు శిక్షణ ఇచ్చారు. ఈ నెల 12 నుంచి పునః ప్రారంభం కానున్న పాఠశాలల్లో వంటలు రుచికరంగా ఉండేలా చూడాలన్నారు. శిక్షకులుగా వరలక్ష్మి, శ్రీదేవి వ్యవహరించారు. వంటల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. మధ్యాహ్న భోజన పథకం జిల్లా అబ్జర్వర్ బీరా ప్రసాద్ వంటలను పరిశీలించారు. సీఆర్‌ఎంటీలు అచ్యుతకృష్ణ, సత్తిబాబు, గోవింద, నూకేశ్వరరావు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పూడిమడక తీరాన యోగాంధ్ర

అచ్యుతాపురం రూరల్: ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా రోజూ యోగా చేసినట్లయితే ఎటువంటి అనారోగ్య సమస్యలు దరి చేరవని పతంజలి యోగా సమితి జిల్లా అధ్యక్షుడు భీశెట్టి దొరమ్మనాయుడు తెలిపారు. జిల్లాలో అతి పెద్ద మత్స్యకార గ్రామం పూడిమడక తీరంలో జిల్లా మత్స్యశాఖ అధికారుల ఆధ్వర్యంలో 500 మంది మత్స్యకారులతో యోగాంధ్ర కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. యోగా అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. డీఎఫ్‌వో ప్రసాద్, ఫిషరీస్‌డీ షేక్ జాస్మిన్, మత్స్యశాఖ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న మత్స్యకారులు

కాలువలు ఇలా.. సాగునీరు ఎలా..!

- అధ్వానంగా తాండవ, దుగ్గాడ ప్రధాన కాలువలు
- చెత్తా చెదారం, పిచ్చిమొక్కలతో దర్శనం
- కానరాని పూడికతీత పనులు
- ఆందోళనలో రైతులు



తాండవ కాలువలో పేరుకుపోయిన పిచ్చిమొక్కలు



దుగ్గాడ కాలువలో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు

కోటవురట్ల: గత వైఎస్సార్‌సీపీ హయాంలో పెట్టుబడి సాయంతోపాటు సాగుకు అనుకూల పరిస్థితులను కల్పించి రైతన్నలకు కొండంత ఆసరా లభించింది. కూటమి ప్రభుత్వం రాగానే వారి ఆశలపై నీళ్లు చల్లింది. ఇచ్చిన హామీలను తుంగలోకి తొక్కి రైతు పెట్టుబడి సాయానికి కూడా ఎగనామం పెట్టింది. ఇక సాగు సహకారం ఇస్తుందా అంటే అదీ కనిపించడంలేదు. మండలంలో సాగునీరు అందించే తాండవ, దుగ్గాడ ప్రధాన కాలువల పరిస్థితి అధ్వానంగా ఉంది. దాంతో ఖరీఫ్ సాగు ప్రశ్నార్థకంగా మారింది. సాగునీరు అందుతుందా అన్న ఆందోళన రైతన్నల్లో మొదలుతోంది.

మండలంలో తాండవ ప్రాజెక్టు పరిధిలో నాతవరం, పాయకరావుపేట, కోటవురట్ల మండలాలు ఉండగా, 55 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రాజెక్టుకు సంబంధించి లెఫ్ట్ మెయిన్ కెనాల్ అయిన కోటవురట్ల మేజర్ చానల్ పరిధిలో 6,500 ఎకరాల ఆయకట్టు ఉంది. దుగ్గాడ ప్రాజెక్టు నుంచి కోటవురట్ల చానల్ పరిధిలో 3 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. దుగ్గాడ కాలువంతా పిచ్చిమొక్కలు, పొదలతో నిండిపోయింది. ఇటువంటి పరిస్థితుల్లో అవసరానికి సాగునీరు వదిలినా 80 శాతం భూములకు అందని పరిస్థితి కనిపిస్తోంది.

పలు చోట్ల పాడైన అక్విడెక్టులు

తాండవ కాలువలో సిమెంట్ లైనింగ్ శిథిలం కావడంతోపాటు పలు చోట్ల అక్విడెక్టులు పాడయ్యాయి. వీటికి తోడు పిచ్చిమొక్కలు, చెత్తా చెదారంతో విపరీతమైన పూడిక ఏర్పడింది. తాండవ ప్రాజెక్టు కోటవురట్ల మేజర్ చానల్ పొడవు 17 కిలోమీటర్లు కాగా ఇటీవల 7 కిలోమీటర్ల వరకు పూడిక తీశారు. నాతవరం మండలంలో తాండవ ప్రాజెక్టు నుంచి మొదలై అదే మండలం చెర్లోపాలెం శివారు వరకు మాత్రమే పూడిక తీత పనులు చేశారు. అంటే కోటవురట్ల మండలంలో చానల్ ప్రారంభ గ్రామం కొత్తూరు వరకు మాత్రమే పని పూర్తయింది. అక్కడి నుంచి మిగిలిన 10 కిలోమీటర్లు మొత్తం కోటవురట్ల మండల చానల్ పరిధిలో ఉంది. ఈ కాలువంతా పూడికతో నిండిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. 50 ఏళ్ల చరిత్ర కలిగిన ప్రాజెక్టు కావడంతో చాలా చోట్ల కాలువ శిథిలమైంది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ హయాంలో ప్రాజెక్టు నుంచి మేజర్ చానల్‌ను సిమెంట్ లైనింగ్‌తో అభివృద్ధి చేశారు. దాంతో ఆ రోజుల్లో శివారు భూములకు సైతం సాగునీరు అందేది. ప్రభుత్వాలు మారుతూ వస్తున్నాయే తప్ప ప్రధాన ఆయకట్టు చానల్‌ను మాత్రం అభివృద్ధి చేయడం లేదు. కనీసం పూడిక తీయించకపోవడంతో రైతులకు ఇక్కట్లు తప్పడంలేదు. గత ఏడాది తాండవ ప్రాజెక్టు నుంచి కోటవురట్ల మేజర్ చానల్ పదో కిలోమీటరు వరకు సాగునీరు అందించగా, ప్రస్తుతం అదీ కనిపించడం లేదు. కాలువలో పలు చోట్ల రాతిపేరుపులో ఖాళీలు ఏర్పడడంతో ఎక్కడికక్కడ సాగునీరు ఇంకిపోయి ప్రవహించే పరిస్థితి లేదు. నాలుగు చోట్ల అక్విడెక్టులు ఉండగా అవి పూర్తిగా శిథిలమయ్యాయి. వీటిని అభివృద్ధి చేస్తే కానీ ఆయా ప్రాంతాలలో నీరు ముందుకెళ్లే పరిస్థితి లేదు. ఖరీఫ్ సీజను ప్రారంభమైనా మండలంలో మేజర్ చానల్‌లో పూడిక తీత పనులు చేపట్టలేదు. దాంతో పాములవాక, భీమిరెడ్డి పాలెం, నీలిగుంట, లింగాపురం ప్రాంత రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు ముందుగా కాలువలో పూడిక తీయించి మరమ్మతులు చేయించాలని పలువురు రైతులు కోరుతున్నారు.

పూడిక తీత, అక్విడెక్టుల మరమ్మతులకు నివేదిక

తాండవ ప్రాజెక్టు ఎడమ ప్రధాన కాలువ నర్సీపట్నం మండలం బలిఘట్టం, కోటవురట్ల మేజర్ చానల్ ద్వారా సాగునీరు అందుతుంది. ఈ చానల్ పొడవు 19.6 కిలోమీటర్లు కాగా కోటవురట్ల మేజర్ చానల్ పొడవు 17 కిలోమీటర్లు ఉంది. ఇందులో 7 కిలోమీటర్ల మేర పూడిక తీత పనులు పూర్తయ్యాయి. మిగిలిన 10 కిలోమీటర్లలో పూడిక తీతకు, నాలుగు అక్విడెక్టుల మరమ్మతులకు నివేదిక పెట్టాం. నిధులు మంజూరు కాగానే పనులు చేపడతాం. ఈ ఏడాది కోటవురట్ల మేజర్ చానల్‌లో 15 కిలోమీటరు వరకు సాగునీటిని సరఫరా చేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నాం.

– శ్యామ్‌కుమార్, తాండవ ప్రాజెక్టు జేఈ

ఏటా ఇబ్బందులే..



ఖరీఫ్ సీజనులో ఏటా ఇబ్బందులు వస్తూనే ఉన్నాయి. కోటవురట్ల మేజర్ చానల్‌లో కొంత వరకు పనులు చేసి చేతులు దులుపేసుకుంటున్నారు. దాంతో రైతులే స్వచ్ఛందంగా కాలువల్లో పూడిక తీసుకుంటున్నారు. ఈ ఖరీఫ్‌లో పూర్తిస్థాయిలో పూడిక తీసి పాడయిన చోట్ల మరమ్మతు చేయించాలి. చాలా చోట్ల రాతిపేరుపు కదిలిపోవడంతో నీరు వృథా అవుతోంది. అక్విడెక్టులకు మరమ్మతు చేయించాలి.

– కిల్లాడ శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్, పాములవాక

రైతుల కష్టాలు ప్రభుత్వానికి పట్టలేదు..



రైతుల కష్టాలు ప్రభుత్వానికి పట్టలేదు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలో ఒకటైన అన్నదాత సుఖీభవకు ఎగనామం పెట్టారు. కనీసం ఈ ఏడాదైనా ఇస్తే రైతులకు కొంత ఇబ్బంది తప్పుతుంది. దుగ్గాడ కాలువలో విపరీతంగా పూడికలు పెరిగిపోయాయి. అధికారులు దృష్టి సారించి ఖరీఫ్ సీజనులో సాగునీటికి ఇబ్బంది లేకుండా చేయాలి. – పొరుపల్లి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్, జల్లూరు

సేంద్రియ సాగుతో మెరుగైన దిగుబడులు

జిల్లా వ్యవసాయ శాఖాధికారి మోహనరావు



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ శాఖాధికారి మోహనరావు

మునగపాక: సేంద్రియ సాగుపై రైతులు దృష్టి సారించాలని, తద్వారా మెరుగైన దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయ శాఖాధికారి మోహనరావు పేర్కొన్నారు. మండలంలోని వాడ్రాపల్లిలో మంగళవారం బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం, జిల్లా వ్యవసాయ శాఖ సంయుక్త నిర్వహణలో కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులకు అవసరమయ్యే ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచామన్నారు. ఎరువుల వినియోగంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వరిలో యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. భూసార శాస్త్రవేత్త శ్రీహరిరావు మాట్లాడుతూ సహజ ఎరువుల వినియోగంపై దృష్టి సారించాలన్నారు. మట్టి ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. పశువైద్య శాస్త్రవేత్త డాక్టర్ విజయరాణి మాట్లాడుతూ వర్షాకాలంలో పశువుల పోషణ, పశు గ్రాస సాగులో యూరియా వాడకంపై తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏవో జ్యోత్స్నకుమారి మాట్లాడుతూ రాయితీపై రైతు సేవా కేంద్రాల్లో పచ్చిరొట్ట ఎరువులు స్థానికంగా అందుబాటులో ఉన్నాయన్నారు. సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు, రైతులు పాల్గొన్నారు.

వైభవంగా వేమాంబిక జాతర



కన్నబాబురాజుకు అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

యలమంచిలి రూరల్: మున్సిపాలిటీ పరిధి పెదపల్లిలో మంగళవారం వేమాంబిక అమ్మవారి జాతర అంగరంగ వైభవంగా జరిగింది. జాతరను పురస్కరించుకుని అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. మహిళలు అమ్మవారికి చీర, రవిక, పసుపుకుంకుమ, గాజులు, నల్లపూసలు పెట్టి ప్రత్యేక పూజలు చేశారు. కొందరు భక్తులు అమ్మవారి ఆలయం వద్ద తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనకు స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు సాదర స్వాగతం పలికారు. దర్శనం అనంతరం అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రంతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బొద్దపు ఎర్రయ్య దొర, కోడిగుడ్డు రమణ, దాసరి గణేష్, దాసరి కుమార్, బొద్దపు కాశీ, బొద్దపు నారాయణరావు, బొద్దపు మణిప్రకాష్, దుంగా అచ్యుతరావు, పోతల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపైకి మురుగు వదిలితే చర్యలు

సాక్షి ఎఫెక్ట్..



నివాసాల నుంచి రోడ్డుపైకి వస్తున్న మురుగు పరిశీలిస్తున్న ఎంపీడీవో తదితరులు

ఎస్.రాయవరం: నివాసాల నుంచి నేరుగా అడ్డురోడ్డు జంక్షన్‌లో మెయిన్ రోడ్డుపైకి మురుగు చేరడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై గత నెల 28న 'రోడ్డుపై మురుగునీటితో అవస్థలు' అనే శీర్షికతో సాక్షిలో ప్రచురితమైంది. స్పందించిన ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యనారాయణ మంగళవారం పరిశీలించారు. మురుగు రోడ్డుపైకి మళ్లించిన నివాసదారులకు నోటీసులిచ్చి, నివారణ చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి ఎం.సాయిలక్ష్మిని ఆదేశించారు. డ్రైనేజీ సమస్య ఉంటే ప్రతిపాదన పెట్టాలని, అంతవరకు నివాసదారులు ప్రత్యామ్నాయంగా ఇంకుడు గుంతలు ఏర్పాటుచేసుకోవాలన్నారు. తాము పంచాయతీ అనుమతులు తీసుకుని భవనాలు నిర్మించామని, వాడుక నీరు పోయే ఏర్పాట్లు ప్రభుత్వమే చేపట్టాలని నివాసదారులు కోరారు.

పాడి రైతులకు మెరుగైన సేవలు



ప్రహరీ పనులకు భూమిపూజ చేస్తున్న విశాఖ డెయిరీ చైర్మన్ ఆనంద్‌కుమార్

మునగపాక: పాడి రైతులకు మెరుగైన సేవలందిస్తున్నామని విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ కోరారు. స్థానిక తులసీ కల్యాణ మండపం ప్రహరీ నిర్మాణానికి ఆయన మంగళవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇక్కడ తులసీ కల్యాణ మండపం నిర్వహణపై సొసైటీ సభ్యులు దృష్టి సారించాలన్నారు. డెయిరీ ద్వారా కొంత నగదును ప్రహరీ నిర్మాణానికి అందజేస్తామన్నారు. విశాఖ డెయిరీ ద్వారా పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో పాల సంఘం అధ్యక్షుడు మళ్ల సంజీవరావు, వేతన కార్యదర్శి పెంటకోట సత్యనారాయణ, విశాఖ డెయిరీ సివిల్ ఇంజినీర్ వెలగా సురేష్‌కుమార్, ఆడారి గణపతి అచ్చియ్యనాయుడు, ఆడారి కాశీబాబు, టెక్కలి పరశురామ్, మళ్ల కాలేశ్వరరావు, సూరిశెట్టి అప్పలనాయుడు, డెయిరీ సూపర్‌వైజర్ రమణ, పాలకవర్గ సభ్యులు, రైతులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



ర్యాలీ నిర్వహించిన పీహెచ్‌సీ సిబ్బంది

అచ్యుతాపురం రూరల్: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే ఎటువంటి వ్యాధులనైనా అరికట్టవచ్చునని వైద్యాధికారి శ్రావ్య తెలిపారు. మలేరియా నివారణ మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం అచ్యుతాపురం పుర వీధుల్లో మలేరియా అంతం మనతోనే అనే నినాదంతో వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం కూడలిలో మానవహారంగా ఏర్పడ్డారు. వ్యాధులు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దోమలు సంతానోత్పత్తి చెందకుండా ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆరోగ్యవంతమైన సమాజం నిర్మించడంలో ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. హెచ్‌ఎస్ సన్యాసిరావు, హెచ్‌ఎలండా అప్పలకొండ, ఏఎన్‌ఎం డి.వరలక్ష్మి, ఆశ కార్యకర్తలు సూర్యలక్ష్మి, సరోజిని పాల్గొన్నారు.

ఉపాధికి బడ్జెట్‌లో కేటాయింపులు పెంచాలి



వేతనదారులతో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము

అచ్యుతాపురం రూరల్: ఉపాధి హామీ పథకం కార్మికులకు కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు పెంచాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము కోరారు. హరిపాలెంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కార్మికులతో మంగళవారం ఆయన మాట్లాడారు. కార్మికులకు 8 వారాల బకాయి వేతనాలు వెంటనే ఇవ్వాలన్నారు. వేతనదారుల అలసటి తీర్చుకునేందుకు షామియానాలతోపాటు మంచి నీటి సదుపాయం కల్పించాలన్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే ప్రథమ చికిత్స అందించేందుకు సామగ్రి, నాణ్యమైన తట్టా, పార, గునపం పంపిణీ చేయాలన్నారు. వేసవి భత్యం, ప్రమాదం జరిగితే ఉచితంగా వైద్యం, మరణిస్తే రూ.25 లక్షలు ఇవ్వాలన్నారు. ఉపాధి హామీ కార్మికులకు ఏడాదిలో 200 రోజులు పని కల్పించి, రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధి కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఘనంగా బోనాలు ఊరేగింపు



గ్రామంలో ఊరేగిస్తున్న బోనాలు, సారె

ఎస్.రాయవరం: ధర్మవరం అగ్రహారం గ్రామంలో దుర్గాంబిక ఆలయ వార్షికోత్సవం పురస్కరించుకుని బోనాలు ఊరేగింపు మంగళవారం ఘనంగా నిర్వహించారు. బోనాలు, సారెను ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఊరేగింపు కార్యక్రమం చేపట్టి ఆలయానికి తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించుకున్నారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

స్వచ్ఛంద సేవలను గుర్తించి సన్మానం

అచ్యుతాపురం రూరల్: వివేకానంద స్ఫూర్తితో 25 సంవత్సరాలుగా స్వచ్ఛంద సేవలు అందిస్తున్న పూడిమడక మత్స్యకార గ్రామానికి చెందిన చోడిపల్లి అప్పారావుకు సిటీ పోలీస్ కమిషనర్ శంఖాబ్రత బాగ్చీ సన్మానం చేశారు. మంగళవారం విశాఖ వన్‌టౌన్ వద్ద వివేకానంద స్వచ్ఛంద సేవా కార్యక్రమంలో అప్పారావు ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి ఇప్పటికి 45 సార్లు రక్తదానం చేసి యువతకు ఆదర్శంగా నిలిచానన్నారు. కార్యక్రమంలో ప్రముఖ సంఘ సేవకులు ద్రోణంరాజు శ్రీవాత్సవ్, స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు పాల్గొన్నారు.

15న తీరంలో వెయ్యి మందితో యోగా



బీచ్‌లో పర్యటిస్తున్న అధికారులు

ఎస్.రాయవరం: కొత్త రేవుపోలవరం బీచ్‌లో ఈ నెల 15న వెయ్యి మందితో యోగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టాలని డీఆర్‌డీఏ పీడీ, పాయకరావుపేట నియోజకవర్గ ప్రత్యేకాధికారి శచీదేవి తెలిపారు. రేవుపోలవరం, కొత్తరేవుపోలవరం గ్రామాల్లో మంగళవారం ఆమె పర్యటించారు. తీరంలో నేలను చదును చేసి ఎక్కువ మంది యోగాలో పాల్గొని శిక్షణ ఇవ్వాలన్నారు. గ్రామ స్థాయిలో పంచాయతీ కార్యదర్శులకు, సర్పంచ్‌లకు, సమాచారం ఇవ్వాలని ఎంపీడీవో సత్యనారాయణకు సూచించారు. బీచ్ పరిసర ప్రాంతాలను పరిశీలించి పరిశుభ్రంగా తయారు చేసి ఆకర్షణీయంగా మార్చాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జె.రమేష్‌బాబు, ఏపీవో శివప్రసాద్, సర్పంచ్ మల్లే లోవరాజు, గుడివాడ మాజీ సర్పంచ్ నల్లపరాజు వెంకటరాజు, వీఆర్వీ అప్పలరాజు, నాయకుడు మల్లికార్జున, పంచాయతీ కార్యదర్శి, వీఆర్వోలు పాల్గొన్నారు.

వెన్నుపోటు దినం ర్యాలీకి అనుమతించాలని వినతి



మండలాధ్యక్షుడు శంకర రావు



హెచ్‌సీ ధనరాజ్‌కు వినతి అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు సూర్యనారాయణ, రాజు

మునగపాక: వెన్నుపోటు దినం కార్యక్రమానికి అనుమతి మంజూరు చేయాలని కోరుతూ మంగళవారం వైఎస్సార్‌సీపీ నేతలు నరాలశెట్టి సూర్యనారాయణ, కాండ్రేగుల రాజు వినతిపత్రం అందజేశారు. కూటమి ప్రభుత్వం హామీలను విస్మరించిన నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించే ఈ కార్యక్రమానికి అనుమతి ఇవ్వాలని హెచ్‌సీ ధనరాజ్‌కు వినతి అందజేశారు.

వెన్నుపోటు దినం పోస్టర్ విడుదల



కరపత్రం విడుదల చేసిన చిక్కాల రామారావు

పాయకరావుపేట: వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు కోరారు. జెడ్పీటీసీ లంక సూర్యనారాయణ, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి దగ్గుపల్లి సాయిబాబాలతో కలిసి వెన్నుపోటు దినం కరపత్రాలను విడుదల చేశారు. బుధవారం ఉదయం 9.30 గంటలకు పట్టణంలో దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, పట్టణ అధ్యక్షుడు ధనిశెట్టి మహేష్, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, నాయకులు కోనే పుత్రరావు, జొన్నకూడి సూరిబాబు, పిరాధి రాజు పాల్గొన్నారు.

అచ్యుతాపురం రూరల్: మాజీ ఎమ్మెల్యే కన్నబాబు రాజు ఆధ్వర్యంలో బుధవారం యలమంచిలిలో నిర్వహించే వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు దేశంశెట్టి శంకర్రావు కోరారు. మండల ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

కొబ్బరి చెట్టుపై నుంచి జారిపడి యువకుడి మృతి



మృతుడు కొల్లి రాజు

అచ్యుతాపురం రూరల్: జంగులూరుకు చెందిన కొల్లి రాజు (34) కొబ్బరి చెట్టుపై నుంచి జారిపడి మృతి చెందాడు. అచ్యుతాపురం ఇందిరమ్మ కాలనీలో తన అత్తమామల ఇంటి దగ్గర సాయంత్రం 5 గంటల ప్రాంతంలో కొబ్బరి కాయలు తీసేందుకు చెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు జారిపడటంతో అనకాపల్లి ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఒక పాప ఉన్నట్టు కుటుంబీకులు తెలిపారు. కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

మూడో రోజు ముప్పతిప్పలే

- మొరాయిస్తున్న మెషీన్లు
- నరుకుల పంపిణీలో సాంకేతిక సమస్యలు



కోటవురట్ల మండలంలో డిపో వద్ద నిరీక్షణ

నక్కపల్లి: రేషన్ సరకులు కోసం కార్డుదారులు మూడో రోజూ ముప్పతిప్పలు పడ్డారు. సర్వర్లు మొరాయించడం, మెషీన్లు పనిచేయకపోవడం, నెట్‌వర్కు లేకపోవడంతో డిపోల వద్దకు వచ్చిన కార్డుదారులకు వెంటనే సరుకులు ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. గతంలో ఎండీయూ వాహనాల ద్వారా నెట్‌వర్కు పూర్తిగా వచ్చే ప్రాంతాల్లోకి వచ్చి కార్డుదారులకు వారి ఇళ్ల వద్దే సరుకులు పంపిణీ చేసేవారు. ఈ నెల నుంచి నిత్యావసర సరుకులను డిపోల వద్దకు వెళ్లి తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించడంతో కార్డుదారులకు తిప్పలు తప్పడం లేదు. ఉపమాక శివారు మనబాన వానిపాలెం, సారిపల్లి పాలెం, అయ్యన్నపాలెం, కొండవెనుకపాలెం, అమలాపురం శివారు మూలపర, దేవవరం శివారు ఒడ్డిమెట్ట, జగన్నాథపురం శివారు సీతానగరం, డీఎల్ పురం శివారు వాడపేట, చినతీనార్ల శివారు యాతపేట, చినదొడ్డిగల్లు శివారు కొత్తూరు, వేంపాడు శివారు కొత్తూరు తదితర శివారు గ్రామాల వారికి ఇంకా సరుకులు పంపిణీ ప్రారంభం కాలేదని సమాచారం. ప్రధాన గ్రామంలో పంపిణీ పూర్తయ్యాక శివారు గ్రామాల వారికి అందజేయనున్నట్లు తెలుస్తోంది. ప్రధాన గ్రామాల్లో ఉన్న డిపోలకు వెళ్లి సరుకులు తెచ్చుకోవాలంటే మూడు నుంచి నాలుగు కిలోమీటర్ల దూరం వెళ్లాలని, ఎండలు తారెత్తిస్తున్నాయని కాలు బయట పెట్టలేని పరిస్థితి ఉందంటూ శివారు గ్రామాల వారు చెబుతున్నారు. కార్డుల సంఖ్య ఎక్కువగా ఉన్న గ్రామాల్లో డిపోల వద్ద కార్డుదారులు క్యూ కడుతున్నారు. సాంకేతిక సమస్యల వల్ల గంటల తరబడి పడిగాపులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. మొత్తం మీద ఎంకిపెళ్లి సుబ్బి చావుకొచ్చిందన్నట్లు ఎండీయూ వాహనాల రద్దు వ్యవహారం కార్డుదారులను ముప్పతిప్పలు పెడుతోంది.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలచిన వారు సంప్రదించండి.
పాయకరావుపేట డివిజన్:
9951602901
Office mail : sakshiadvtvsp@gmail.com